

ఆనందంలో ఆటో కాలా!

● 'వాహన మిత్ర' ద్వారా 6600 మందికి లబ్ధి ● 17 నుంచి 19 వరకు దరఖాస్తుల స్వీకరణ

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'ఆటో మిత్ర' పథకంద్వారా సుమారు 6600మంది ఆటో డ్రైవర్లకు లబ్ధి చేకూరనుంది.గత నెల 15న 'స్త్రీ శక్తి' పథకం పేరిట మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించిన విషయం విదితమే. ఈ పథకం వల్ల తమకు ఆదాయం తగ్గుతుందని ఆటో డ్రైవర్లు డీలాపడ్డారు. వారిని కూడా ఆదుకుంటామని అప్పట్లో సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అన్నట్లుగానే వారికి రూ.15 వేల వంతున దసరా కానుకగా అందిస్తామని ఇటీవల ప్రకటించారు. జిల్లాలో రూ.15 వేల వంతున 6600 మందికి రూ.99 లక్షల లబ్ధి చేకూరనుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ఆటో, మ్యాక్సీక్యాబ్ యజమానులకు, డ్రైవర్‌గా స్వయం ఉపాధి పొందుతున్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. ఇదివరకే ఉన్న లబ్ధిదారుల జాబితాను పరిగణించడంతో పాటు కొత్త దరఖాస్తులకు ఈ నెల 17 నుంచి 19వతేది వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించవచ్చు. 22వ తేదిలోపు క్షేత్ర పరిశీలన పూర్తిచేసి 24న తుది జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయి. అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లోకి అక్టోబర్ 1న సీఎం చంద్రబాబు డబ్బులు జమ చేయడం ప్రారంభిస్తారు.

అర్హతలివే

ఆటో, మాక్సీక్యాబ్ యజమానే డ్రైవర్‌గా ఉండాలి. ఆధార్, తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబంలో ఒక వాహనానికి మాత్రమే పథకం వర్తిస్తుంది. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులున్నా, ఆదాయపు పన్ను చెల్లించేవారున్నా, నెలవారీ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటినా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థిరాస్తి ఉన్నా పథకానికి అర్హులు కారు.

డీఎస్సీ విజేతల జాబితా నేడు విడుదల



ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరైన డీఎస్సీ అభ్యర్థులు(ఫైల్ ఫొటో)

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను సోమవారం పాఠశాల విద్యాశాఖ ప్రకటించనుంది. అభ్యర్థుల పూర్తి వివరాలు కలెక్టర్, డీఈవో వెబ్‌సైట్లకు పంపనుంది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 1478 నోటిఫైడ్ పోస్టులు భర్తీ చేయనుండగా వీటిలో ప్రభుత్వ, స్థానిక యాజమాన్యంలోనివి 1317 పోస్టులు కాగా, మున్సిపల్‌లో64, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 97పోస్టులు భర్తీ చేయనున్నారు.26,501 మంది అభ్యర్థుల నుంచి 45,221 దరఖాస్తులు రాగా వడపోతల తరువాత చివరికి 19,550 మంది పరీక్షలు రాశారు.అభ్యర్థుల టెట్ స్కోర్ (20శాతం), డీఎస్సీ స్కోర్ (80శాతం) లకు వెయిటేజ్‌తో మెరిట్ జాబితాలు రూపొందించారు.ఏడు రౌండ్లలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరిగింది.ఎంపిక పరిధిలోకి వచ్చిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు మరో మారు విజయవాడ కేంద్రంగా జిల్లా విద్యాశాఖ అధికారులతో పరిశీలింపజేశారు. యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా డీఎస్సీ విజేతల తుది ఎంపిక జాబితాను సోమవారం విడుదల చేయనున్నారు.

అయ్యో.. ఎంత బాధొచ్చిందో!

● పాకాలవారిపల్లె అటవీప్రాంతంలో రెండు మృతదేహాలు ● దంపతులుగా భావిస్తున్న పోలీసులు

● ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానం



దంపతులు ఆత్మహత్య చేసుకున్న ప్రాంతం

చంద్రగిరి/పాకాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాళ్లకు ఎంత బాధొచ్చిందో.. ఏమో! ఇద్దరు చెట్టుకు ఉరేసుకున్నారు. అక్కడి పరిస్థితులను బట్టి మరో ఇద్దరు పిల్లలను పూడ్చివేసినట్లు అనుమానిస్తున్నారు.చంద్రగిరి మండలం పాకాలవారిపల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలోని మూలకోన అటవీప్రాంతంలో ఆదివారం సాయంత్రం గొర్రెల కాపరులకు దుర్వాసన రావడంతో మృతదేహాలున్న విషయం బయటపడింది. అటవీశాఖ సిబ్బంది, పాకాల సీఐ సుదర్శన్, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి. సంఘటనా స్థలంలో మద్యం, కూల్‌డ్రింక్ బాటిళ్లు, మాత్రలు, సెల్‌ఫోన్ చార్జర్, చిన్నపిల్లల దుస్తులున్నాయి. అక్కడే రెండు గోతులు తీసి, ఎత్తుగా మట్టి కప్పి ఉండటం, ఆ గోతులపై రెండు వరుసల రాళ్లుండడంతో ఇద్దరు పిల్లలను పూడ్చి వేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీళ్ల వెళ్లేసరికే సాయంత్రం 6 గంటలు కావడంతో మృతదేహాలను పరిశీలించి వచ్చేశారు. ఈ అటవీ ప్రాంతంపై అవగాహన ఉన్న వాళ్ళే ఆత్మహత్య చేసుకొని ఉంటారని భావిస్తున్నారు.ఈ ప్రాంతం పరిధి చంద్రగిరా లేదా పాకాల మండలమా అని పోలీసులు తర్జన భర్జన పడుతున్నారు. అటవీ ప్రాంతం పరిధి మాత్రం పాకాల మండల రెవెన్యూ పరిధిలోకి వస్తుందని చంద్రగిరి పోలీసులు అంటే, పాకాలవారిపల్లె చంద్రగిరి మండలంలో ఉందని పాకాల పోలీసులు అంటున్నారు. సోమవారం ఉదయం మృతదేహాలను పరిశీలించి, గోతులు తవ్వి దర్యాప్తు చేపట్టనున్నారు.





కామధేను వాహనంపై ఊరేగుతున్న సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడు - ఉత్సవర్లకు హారతి

కామధేనువుపై కాణిపాక స్వామి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో విఘ్ననాథుడు ఆదివారం రాత్రి కామధేను వాహనంపై విహరించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన నాయీ బ్రాహ్మణులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామివారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. మూల విరాట్‌ను శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులకు ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి వారి ఉత్సవ విగ్రహాలను కామధేను వాహనంలో వుంచి భాజాభజంత్రీల మధ్య కాణిపాక పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు.ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామికి పూలంగి సేవ నిర్వహించనున్నారు.

తిరుపతి మోడల్ బస్టాండు

త్రీడీ నమూనాను పరిశీలించిన సీఎం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఇంట్రా మోడల్ బస్టాండు నిర్మాణానికి తొలి అడుగుపడింది. ఆదివారం సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎన్‌హెచ్‌ఎల్‌ఎంఎల్ ప్రతినిధులు తాము రూపొందించిన త్రీడీ నమూనా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్ టర్మినల్ నిర్మించాలని సీఎం వారికి సూచించారు. సకల సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని, హెలిపాడ్, రోప్‌వే సౌకర్యాల సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. భవిష్యత్తులో అన్ని ఎలక్ట్రిక్ బస్సులే నడిపే అవకాశమున్నందున విరివిగా ఛార్జింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు.







సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కేశవ్



మహిళా శక్తి.. దేశానికి ప్రగతి

● చారిత్రక ఘట్టానికి తిరుపతి అపూర్వ వేదిక ● నగరంలో తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సు



సదస్సు ప్రాంగణం వద్ద మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

తిరుపతి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి.. జాతీయ మహిళా సాధికారత సదస్సుకు వేదికగా నిలిచింది. దేశనలుమూలలనుంచి మహిళా సాధికారత కమిటీ ప్రతినిధులు, పార్లమెంటు సభ్యులు వంటి ప్రముఖులు హాజరవడంతో తిరుపతి ఒక చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిచ్చింది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో 'వికసిత్ భారత్‌కు మహిళల నాయకత్వం' అనే నినాదంతో నిర్వహిస్తున్న రెండు రోజుల సదస్సు ఆదివారం రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభమైంది. చట్టసభల్లో మహిళా ప్రజాప్రతినిధులకు ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లు, ఇబ్బందులు.. వాటిని అధిగమించడంలో మహిళా సాధికారత పాత్రపై చర్చించారు. 'మన కుమార్తెలు చదువుకొని స్వయం ఆధారితులైతేనే భారతదేశం సమగ్ర, అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది' అని సదస్సును ప్రారంభించిన ఓం బిర్లా స్పష్టంచేశారు. గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించారు. భారత రాజ్యాంగం మహిళల హక్కులకు బలమైన పునాదులు వేసిందని రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ అన్నారు. మహిళా స్వశక్తీకరణపై లోతైన చర్చలకు ఈ సదస్సు ముఖ్య వేదికగా నిలిచిందన్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సగం భాగం ఇచ్చే చట్టం చేశారని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్లు కల్పించారని, ప్రతిభా భారతి స్పీకర్‌గా నియమించడం ఒక చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్రస్థాయి మహిళా సాధికారత కమిటీలను పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీతో కలిపి పవిత్ర క్షేత్రమైన తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం చారిత్రాత్మకమైన ఘట్టమని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు పేర్కొన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఒక మైలురాయి అని, అయితే భవిష్యత్తులో రిజర్వేషన్ల అవసరం లేకుండా మహిళలు 50శాతం కంటే ఎక్కువ ప్రాతినిధ్యం పొందే రోజు రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. మహిళా నేతృత్వంలోని అభివృద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారని పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గృహ హింస చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటి చట్టాలను సమర్థంగా అమలు చేయాలని కోరారు. మహిళలు, పిల్లల రక్షణ, దివ్యాంగుల సాధికారత, వయోవృద్ధుల భద్రత కోసం కలిసి పనిచేయాలని రాష్ట్ర మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం చంద్రబాబు మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం,'డెవలప్మెంట్ నీడ్స్ ఉమెన్' నినాదంతో పరిపాలన చేస్తున్నారని ప్రశంసించారు. తల్లికి వందనం, దీపం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలతో పాటు పెన్షన్లు, ప్రసూతి సాయం, రైతు కేంద్రిత ప్రయోజనాలు మహిళలకు మేలు చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఏఐ, బయోటెక్నాలజీ, డిజిటల్ ఎకానమీలో మహిళలు వెనుకబడకూడదని తమ ప్రభుత్వం డిజిటల్ లిటరసీ, నైపుణ్యాధికార విద్య, క్వాంటం కంప్యూటింగ్ వంటి కొత్త నైపుణ్యాలలో పెట్టుబడులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. కూటమి నేతలు పాల్గొన్నారు.



పురందేశ్వరికి జ్ఞాపిక బహూకరిస్తున్న స్పీకర్, డిప్యూటీ స్పీకర్, పక్కన గౌరు చరితారెడ్డి

చంద్రగిరి కోటలో అతిథులకు విందు







చంద్రగిరి కోటలో లైటింగ్ షో, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న డెలిగేట్లు

చంద్రగిరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సదస్సుకు హాజరైన డెలిగేట్లకు చంద్రగిరి కోటలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదివారం రాత్రి విందు ఇచ్చారు. ఇందులో భాగంగా చంద్రగిరి కోట విశేషాలను తెలియజేసే సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని సభ్యులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోట ఆవరణలో ప్రదర్శించిన కుంభకోయ, థింసా, గంగజాతర నృత్యం, కూచిపూడి నృత్యం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అతిథులకు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, భూమా అఖిలప్రియ, బొజ్జల సుధీర్‌రెడ్డి, గురజాల జగన్మోహన్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనరు మౌర్య, అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, టూరిజం టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, ఇతర అధికారులు సిబ్బంది, స్వాగతం పలికారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళాభ్యున్నతికి సాధికారత సోపానం

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం జాతీయ మహిళ సాధికారత సదస్సు ప్రారంభమైంది. రెండురోజుల పాటు జరిగే ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల చట్టసభల జాతీయ మహిళ సాధికారత సభ్యులు హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షత వహిస్తున్నారు. ఈ సందర్భంగా మహిళ సాధికారతపై సభ్యులు ఏమన్నారంటే...

మహిళా సాధికారతతోనే అభివృద్ధి



మహిళలు సర్వతోముఖాభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు మహిళా పక్షపాతులు. మహిళలకు ఆస్తిలో సగంవాటా, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్శిటీ ఏర్పాటు లాంటి కార్యక్రమాలకు ఆనాడు దివంగత ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. ఆయన పంథాలోనే చంద్రబాబునాయుడు పదవుల్లో, ఉద్యోగాల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నారు. ఇలాంటి సదస్సులు వల్ల మహిళలు ఎదగడానికి అవకాశం ఉంటుంది.

- వంగలపూడి అనిత, రాష్ట్ర హోంమంత్రి

వంట గది నుంచి అంతరిక్షయానానికి



మహిళలు పూర్వపు రోజుల్లో వంట గదికే పరిమితమయ్యేవారు. నేడు అంతరిక్షానికి ప్రయాణించే స్థాయికి చేరుకున్నారు. అద్భుతమైన మైళ్లురాళ్లను అధిగమిస్తున్నారు. మహిళలు మరింత ముందంజ వేయడానికి సాధికార సదస్సు ఉపయోగపడుతుంది. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో మహిళల సాధికారత, సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. 33శాతం రిజర్వేషన్లను తీసుకురానుంది.

-డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ,

ఫలప్రద చర్చలకు ఆస్కారం



మహిళలు అనేక రంగాల్లో రాణిస్తున్నారు. గ్రామీణ మహిళలు సైతం చట్టసభల్లో అడుగు పెడుతున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా దూరదృష్టితో మహిళల అభివృద్ధి కోసం తొలిసారిగా మహిళా సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం గర్వించదగ్గ విషయం.. సదస్సులో ఫలవంతమైన చర్చలు జరుగుతున్నాయి.

- సుధామూర్తి, రాజ్యసభ సభ్యురాలు, కర్ణాటక

మరింత సాధికారత అవసరం



స్త్రీ ఆర్థిక, రాజకీయ, సామాజిక స్వావలంబన సాధించిన దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. దేశ జనాభాలో సగం ఉన్న మహిళలు మరిన్ని రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలి. మహిళ ఆర్థిక స్వావలంబన సాధించినపుడే కుటుంబం మెరుగైన స్థితికి చేరుకుంటుంది. ఇలాంటి సదస్సులు మహిళలకు ప్రయోజనకరం

- వరలక్ష్మి, చెంగల్పట్ ఎమ్మెల్యే, తమిళనాడు

విద్యతో వివక్షకు సమాధానం



ఏపీ ప్రభుత్వం జాతీయ మహిళా సాధికారత సదస్సుకు చేసిన ఏర్పాట్లు బాగున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి అభినందనీయం. బాల్య దశ నుంచే మహిళలపై వివక్షత కొనసాగకుండా ఉండాలంటే బాలికలకు మెరుగైన విద్య, వైద్యం అందించాలి. అన్ని రాష్ట్రాల్లో మహిళ హక్కులు కాపాడాలి. ఆర్థికంగా ఎదగడానికి చేయూతనందించాలి.

- కరెమ్మ నాయక్, దేవదుర్గ ఎమ్మెల్యే, కర్ణాటక

33శాతం రిజర్వేషన్ కల్పిస్తే సత్తా చాటుతాం



రాష్ట్రంలో మహిళాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి అమోఘం. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలయితే సర్పంచ్ నుంచి పార్లమెంటు వరకు సత్తా చాటుతారు. పనిచేసే చోట ఇప్పటికీ మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటివి జరగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్న ఈ జాతీయ సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది

- పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే

చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి...



మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధిపై చర్చకు తొలిసారి సాధికార సదస్సు తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉంది. మా అమ్మ శోభా నాగిరెడ్డి చంద్రబాబు స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో వచ్చాను. మహిళలకు చట్టసభల్లో అవకాశం వస్తే సమాజం అభివృద్ధి చెందుతుందనేది చంద్రబాబు విశ్వాసం.

- భూమా అఖిలప్రియ, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే

సదస్సు నిర్ణయాలతో సాధికారతకు బాట



మహిళా సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం కృషి చేస్తున్నాయి. నాడు ఎన్టీఆర్ బాటలోనే నేడు సీఎం చంద్రబాబు మహిళాలోకం గర్వించదగ్గ స్థాయిలో పనిచేస్తున్నారు. ఐటీ రంగంలో కూడా మహిళలే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారు. ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ సదస్సు చర్చించి తీసుకునే నిర్ణయాలతో మహిళా సాధికారత అమలుకు అవకాశం కలుగుతుంది.

- పయ్యావుల కేశవ్, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి

బ్యాంకుల్లో కాసుల గలగల

ఎస్బీఐలో అత్యధిక డిపాజిట్లు - ద్వితీయస్థానంలో గ్రామీణ బ్యాంకు -డీసీసీబీలో రూ. 998.38 కోట్ల డిపాజిట్లు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమవద్ద దాచుకున్న కొద్దిపాటి నగదు నిల్వలను ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే దాచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేటు బ్యాంకులతో పోలిస్తే ప్రభుత్వ బ్యాంకుల్లో ఇచ్చే వడ్డీ తక్కువైనా భద్రత ఉంటుందని జనం గట్టిగా నమ్ముతున్నారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని బ్యాంకుల్లో పెద్దఎత్తున డిపాజిట్లు ఉన్నాయి. డిపాజిట్లకు మించి అన్ని బ్యాంకుల్లో ఇచ్చిన రుణాలు కూడా ఉన్నాయి. దాదాపు అన్ని బ్యాంకుల్లో డిపాజిట్ల సొమ్ము కంటే రుణాలు పంపిణీ చేసిన సొమ్మే అధికంగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా లీడ్ బ్యాంకు విడుదల చేసిన క్రెడిట్ ప్లాన్‌లో ఈ గణాంకాలను వెల్లడించింది. జిల్లా ప్రజల ఆర్థిక స్థితులను అంచనా వేయడానికి ఈ గణాంకాలు దోహదపడతాయని భావిస్తున్నారు.

జిల్లాలోని బ్యాంకులన్నింటిలోను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అగ్రగామిగా కొనసాగుతోంది. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం ఈ బ్యాంకు అటు డిపాజిట్ల సేకరణలోనూ, రుణాల మంజూరులోనూ ముందు వరుసలో వుంది. జిల్లాలో 31శాఖలు కలిగిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2623.98 కోట్ల డిపాజిట్లతో అగ్రస్థానంలో వుంది. ఈ బ్యాంకు రూ.3972.78 కోట్ల రుణాలను ఇచ్చి సీడీ నిష్పత్తి 151.40 శాతం కలిగివుంది. మొన్నటివరకు సప్తగిరి గ్రామీణ బ్యాంకుగా కొనసాగి, పేరు మార్చుకొన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ తర్వాతి స్థానంలో నిలిచింది.గ్రామీణులకోసం తొలుత ఏర్పాటైన ఈ బ్యాంకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 68 శాఖలు కలిగి తనదైన ముద్రవేసింది. ఈ బ్యాంకు రూ.6288.03 కోట్ల డిపాజిట్లతోనూ రూ.3852.00 కోట్ల (సీడీ నిష్పత్తి 61.26) రుణ వితరణ చేసింది. తృతీయ స్థానంలో ఇండియన్ బ్యాంకు నిలిచింది. ఈ బ్యాంకు రూ.1453.26 కోట్ల డిపాజిట్లు కలిగి వుంది. అంతకుమించి జిల్లా ప్రజలను ఆదుకునే రీతిలో రూ.3216.30 కోట్లు (సీడీ నిష్పత్తి 221.32) రుణాలు అందించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానం

బ్యాంకు	శాఖలు	డిపాజిట్లు (రూ.కోట్లలో)	రుణాలు (రూ.కోట్లలో)	సీడీ నిష్పత్తి
ఏపీజీబీ	68	6288.03	3852.00	61.26
ఎస్బీఐ	31	2623.98	3972.78	151.40
ఇండియన్ బ్యాంకు	28	1453.26	3216.30	221.32
యూనియన్ బ్యాంకు	29	1240.15	2100.59	169.38
డీసీసీబీ బ్యాంకు	40	998.38	2436.59	253.41
బ్యాంకు ఆఫ్ బరోడా	6	636.99	313.14	49.16
హెచ్‌డీఎఫ్‌సీ	9	353.14	1245.43	352.67
కరూర్ వైశ్యా బ్యాంకు	7	342.38	424.44	123.97



యూనియన్ బ్యాంకుకు దక్కింది. రూ.1240.15 కోట్ల డిపాజిట్లు కలిగి రూ.2100.59 కోట్లు (సీడీ నిష్పత్తి 169.38)కు చేరింది. 40 శాఖలు కలిగివున్న జిల్లా సహకారకేంద్ర బ్యాంకు రూ.998.38 కోట్లు డిపాజిట్లుగా సేకరించి, రూ.2436.59 శాతం రుణాలు రూపేణ వితరణ చేసింది.

జిల్లావ్యాప్తంగా 256 బ్యాంకుల్లోని డిపాజిట్ల సొమ్ము రూ.15,531.40 కోట్లు ఉండగా, రుణవితరణ సొమ్ము రూ.21,569.80 కోట్లుగా ఉండడం విశేషం. 128 శాఖలు కల్గిన 11వాణిజ్య బ్యాంకులు రూ.6968.67 కోట్లు డిపాజిట్లు , రూ.12,548.63 కోట్లు (సీడీ నిష్పత్తి 180.07) కలిగివుండగా, 51 శాఖలు కల్గిన 14 ప్రైవేటు బ్యాంకులు రూ.1756.80 కోట్ల డిపాజిట్లు, రూ.3779.85 కోట్లు (సీడీ నిష్పత్తి 215.16) కలిగివున్నాయి. జిల్లాలో అతితక్కువ డిపాజిట్లున్న బ్యాంకుగా ఒకేఒక్క శాఖ కల్గిన కర్ణాటక బ్యాంకు రూ.21.59 కోట్ల డిపాజిట్, రూ.66.35 కోట్ల రుణాలు ఇచ్చి (సీడీ నిష్పత్తి 307.32) కలిగివుంది. సిటీ యూనియన్ బ్యాంకు రూ.22.13 కోట్ల డిపాజిట్లు, రుణాలు రూ.30.97 కోట్లు (సీడీ నిష్పత్తి 139.95)తో నిలిచింది.

నేడు కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారని తెలిపారు. జిల్లా అధికారులందరూ విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అదేవిధంగా డివిజన్, మండల స్థాయిల్లో కూడా అధికారులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ తుషార్‌డూడి ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రేమ్‌కుమార్ నియామకం



ప్రేమ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) స్టేట్ డైరెక్టర్‌గా కుప్పం మండలం మల్లానూరుకు చెందిన జి.ప్రేమ్‌కుమార్ నియమితులయ్యారు. నియోజకవర్గానికి ఒకరు చొప్పున మొత్తం 11 మందికి ఏపీఐఐసీ డైరెక్టర్‌గా స్థానం కల్పించగా కుప్పం నుంచి ప్రేమ్ కుమార్‌కు అవకాశం దక్కింది. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్‌కు డైరెక్టర్‌గా పదవి లభించడంతో ఆదివారం అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబులతోపాటు తెలుగు యువత నాయకుడు చెక్కునత్తం మణి తదితరులు శాలువ కప్పి ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఏపీఐసీసీ డైరెక్టర్‌గా తన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తానని, నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదే సమయంలో పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహకరిస్తానని పేర్కొన్నారు.

వైభవంగా వీఐటీ ఛాన్సలర్
విశ్వనాథన్ మనవరాలి వివాహం

తిరుపతి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వీఐటీ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డా. జి. విశ్వనాథన్ మనవరాలు కాదంబరి వివాహం ఆదివారం తిరుపతిలో వైభవంగా జరిగింది.ఏపీ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ దంపతులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు ఈ వివాహానికి హాజరయ్యారు. నూతన వధూవరులు కాదంబరి, డాక్టర్ ఎ.శ్రావణ్ కృష్ణకు గవర్నర్ దంపతులు ఆశీస్సులందజేశారు. ఈ వేడుకలో వీఐటీ ఉపాధ్యక్షులు శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వంతోపాటు రమణి బాలసుందరం, సంధ్యా పెంటారెడ్డి, అనుషా సెల్వం తదితరులు పాల్గొన్నారు.



వధూవరులతో గవర్నర్ దంపతులు

ప్రజాస్వామ్యాన్ని గౌరవించి జగన్ అసెంబ్లీకి రావాలి

- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



రఘురామకృష్ణరాజుకు జ్ఞాపిక అందజేత

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జగన్ ప్రజాస్వామ్యాన్ని గౌరవించి అసెంబ్లీకి రావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు.ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. దర్శనానంతరం అలంకార మండప ప్రాంగణంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.ఆయన వెంట పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్, ఆలయ పునర్నిర్మాణ దాత గుత్తికొండ శ్రీనివాస్, మాజీ చైర్మన్ మణి నాయుడు, నాయకులు దొరబాబు, పూర్ణచంద్రరావు తదితరులున్నారు. దర్శనానంతరం మీడియాతో రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేలు 60 రోజులు శాసనసభకు రాకపోతే అనర్హులవుతారన్నారు. విధివిధానాలు అనుకూలంగా లేనప్పుడు పదేపదే ప్రతిపక్ష హోదా కోరడం రాజ్యాంగ ఉల్లంఘన అవుతుందని స్పష్టం చేశారు.కాగా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం వినాయక స్వామిని దర్శించుకున్నారు.ఆయన వెంట చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్టు సీఐ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు తదితరులున్నారు.

నేడు ఎస్పీ బాధ్యతల స్వీకరణ



స్వామి సేవలో ఎస్పీ తుషార్ డూడి

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్పీ తుషార్ డూడి సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ఆదివారం రాత్రి ఆయన చిత్తూరుకు చేరుకున్నారు.స్థానిక న్యూప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 9.20గంటలకు ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

చల్లావారిపల్లిలో గజరాజుల వీరంగం

- టమోటా, మామిడి, వరి, వేరుశనగ పంటల ధ్వంసం





ఏనుగులు ధ్వంసం చేసిన కొబ్బరిచెట్టు, మామిడిచెట్లు

కల్లూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని చల్లావారిపల్లి వద్ద శనివారం రాత్రి వరి, కొబ్బరి, టమోటా, వేరుశనగ, మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేయడంతో అపార నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని పెద్దవంక నుంచి బయలుదేరిన 11 ఏనుగుల గుంపు కల్లూరు-గంటావారిపల్లి రోడ్డును దాటుకొని పాతపాళ్యం అటవీ మార్గంలో పాతపేట వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని నటరాజ, జయరాం, దొరస్వామి, రామకృష్ణ, గురుప్రసాద్‌కు చెందిన అల్లనేరేడు, మోటారు, వ్యవసాయ నీటి పైపులు, పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి పాతపేట చెరువు మార్గంలో చల్లావారిపల్లి వద్దకు ఏనుగుల గుంపు చేరుకున్నాయి. గ్రామంలోని విజయకుమార్‌కు చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు పశుగ్రాసాన్ని తినేశాయి. సుబ్రహ్మణ్యం, మునిరత్నంనాయుడులకు చెందిన మామిడి, కొబ్బరి, పశుగ్రాసం ధ్వంసం చేశాయి. మధుసూదన్‌నాయుడుకు చెందిన రాతికూసాలను విరిచేశాయి. పాళెం పంచాయతీ కోటపల్లిలోని కౌలు రైతు బాలుకు చెందిన ఎకరా టమోటా పంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన అనంతరం మతుకువారిపల్లి వద్దకు చేరుకున్నాయి. మతుకువారిపల్లిలోని నాగరాజు, వెంకటేష్‌కు చెందిన వేరుశనగ, వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు కల్లూరు-సదుం రోడ్డును దాటుకొని అమ్మచెరువు మార్గంలో పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నట్లు ప్రజలు తెలిపారు.

'డ్రగ్స్ ఫ్రీ తిరుపతి' లక్ష్యం



ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతితో పాటు జిల్లాను డ్రగ్స్ ఫ్రీగా మార్చడానికి పటిష్ఠ ప్రణాళికలను అమలు చేస్తామని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు.పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించాక ఆయన మీడియాతో మాట్లాడుతూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. తమ సమస్యలపై నేరుగా సంబంధిత స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పటిష్టంగా అమలు చేస్తానన్నారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యమిస్తామని చెప్పారు. దేశ, విదేశాల నుంచి తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికలపై నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని కలిసి అభినందనలు తెలిపారు.

ఎర్రచందనం స్వాధీనం: ఒకరి అరెస్టు

పుంగనూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె వద్ద వున్న హంద్రీ-నీవా పంప్ హౌస్ సమీపంలో కారుతోపాటు రూ.33లక్షల విలువైన 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ డి.ప్రభాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం పుంగనూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజంపేట అటవీప్రాంతం నుంచి అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ హరిప్రసాద్ దాడులు చేసి పట్టుకున్నారన్నారు. తమిళనాడు రాష్ట్రం హోసూర్ సమీపంలోని బత్తలపల్లి అన్నామలై నగర్‌కు చెందిన జి.సర్దార్ (36), కృష్ణగిరికి చెందిన మణివణ్ణన్ అలియాస్ కృష్ణ, కర్ణాటకలోని హోస్‌కోటకు చెందిన సయ్యద్ ఆరీఫ్, తిరువన్నామలై జిల్లా జమునాముత్తూరుకు చెందిన రవి శనివారం రాజంపేట అటవీప్రాంతం నుంచి కారులో 660 కిలోల ఎర్రచందనం దుంగలు వేసుకొని బయల్దేరారన్నారు.మణివణ్ణన్,రవి కారులో వుండగా ముందు పైలెట్‌గా మోటారు సైకిల్‌లో జి.సర్దార్, సయ్యద్ ఆరీఫ్ వచ్చారన్నారు. పోలీసులు సర్దార్‌ను అరెస్టు చేయగా ముగ్గురు పరారయ్యారన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ ప్రభాకర్ తదితరులు

మాధవమాలలో కొయ్య బొమ్మల మెటీరియల్ బ్యాంకు

ఏర్పేడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మాధవమాలలో కొయ్య బొమ్మల తయారీ కళాకారులకు కావాల్సిన రా మెటీరియల్ బ్యాంకును త్వరలో ఏర్పాటు చేస్తామని ఏపీ ఫారెస్టు డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ సలహాదారు మల్లికార్జునరావు తెలిపారు. మాధవమాలలోని బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీని ఆదివారం ఆయన సందర్శించారు. కొయ్య బొమ్మలను పరిశీలించారు. భాకరాపేట నుంచి తిరుపతికి ప్రధాన రహదారిని అటవీ ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ఈ రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను ప్రభుత్వం తొలగిస్తుందన్నారు. ఆ దుంగలను మాధవమాలలో స్టాక్‌పెట్టి రా మెటీరియల్ బ్యాంకుగా ఏర్పాటు చేస్తుందన్నారు. వాటితో కళాకారులు బొమ్మలు తదితరాలను తయారు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఐదేళ్ల వరకు రా మెటీరియల్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వివేక్, ఐఎఫ్ఎస్ సబ్ డీఎఫ్ నాగభూషణం, ఎఫ్ఆర్వో సుదర్శన్‌రెడ్డి, మాజీ డీఎఫ్‌వో కృష్ణయ్యరెడ్డి, శాండిల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికుమార్‌రాజు, బాలాజీ ఉడ్ కార్వింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజాచారి, సీఈవో కృష్ణమూర్తి, రెడ్ శాండిల్ అసోసియేషన్ మెంబర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అసహాయులకు అండగా ప్రభుత్వం



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న రాజ్‌కుమార్, ప్రతాప్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అసహాయులకు అండగా నిలబడుతోందని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్‌లు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు, హియరింగ్ మిషన్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అదే సమయంలో ప్రజల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులోనూ మరీ ముఖ్యంగా కుప్పంలో రాబోయే నాలుగేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి సాధనకు అన్నిరకాలైన ప్రణాళికలు సిద్ధం చేశారని చెప్పారు. కుప్పం పట్టణంలో నేతాజీ రోడ్డు విస్తరణతో ప్రారంభించి మున్సిపాలిటీని కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయడానికి కడా సిద్ధమైందన్నారు. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు. అసహాయులు, పేదబడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు దివ్యాంగులకు సాయంగా ఉండటానికే ఉపకరణాలు పంపిణీ చేశారన్నారు. సూపర్‌సిక్స్ సూపర్ సక్సెస్ అయినందుకు ప్రజలందరూ ముఖ్యమంత్రిపై, కూటమి ప్రభుత్వంపై ఎనలేని అభిమానంతో ప్రశంసల జల్లు కురిపిస్తున్నారన్నారు. ఇదే అభిమానం రేపటి స్థానిక ఎన్నికల్లో చూపించి పార్టీకి, పార్టీ మద్దతుతో నిలబడే అభ్యర్థులకు ఘన విజయం అందిస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు



టీడీపీలో చేరిన యువతతో ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష వైసీపీ నుంచి అధికార తెలుగుదేశం పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. కుప్పం మండలం గరిగచీనేపల్లె పంచాయతీ వైస్ సర్పంచి మురుగన్‌తోపాటు పలువురు యువత ఆదివారం ఆ పార్టీ నుంచి టీడీపీలో చేరారు. కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పంచాయతీ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో వైస్ సర్పంచి మురుగన్, పెరితంబి, కుమరేశ్, ఏసురాజ్, సెల్వం, సచిన్, కుమార్, పామిడి, ప్రభు, ప్రశాంత్, శంకర్, గణేశ్, సత్యమణి వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన అరాచకాలు, దౌర్జన్యాలను ఈనాటికీ ప్రజలేకాక, ఆ పార్టీకి సామాన్య కార్యకర్తలే మరచిపోలేక పోతున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతున్నారని, ఇది శుభ పరిణామమని పేర్కొన్నారు. టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్‌తోపాటు టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, రెస్కో చైర్మన్ వీజీ.ప్రతాప్, 11వ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రామచంద్ర, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, నాయకులు సంజీవి, మోహన్, చంద్ర, నరసింహులు, పుల్లయ్య, శశికుమార్, ఏపీ.రవి, హైదర్ వలి, వెంకటేశ్, బంగారు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మోక్షజ్ఞ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం గోవిందపల్లెకు చెందిన మోక్షజ్ఞ అనే యువకుడు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకున్నాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో సీఎం సహాయనిధి నుంచి సాయం అందించాలని కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకున్నారు. వారికి రూ.36,635 ఆర్థికసాయం మంజూరైంది. ఆదివారం ఆర్థికసాయం చెక్కును గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి స్థానిక నేతలతో కలిసి మోక్షజ్ఞ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, మాజీ సర్పంచి జయశంకర్, నేతలు గుర్రప్ప, సత్తి, కృష్ణారెడ్డి, మణేష్, మహేంద్రనాయుడు, షణ్ముగం, రామలింగం, గోపాల్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయంగా కలిసిన పూర్వ విద్యార్థులు

సదుం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1988-89 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాల నడుమ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఆనాటి గురువులను ఆహ్వానించి వారిని ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను స్మరించుకుని సంబరపడ్డారు. పూర్వ విద్యార్థులతోపాటు ఆనాటి గురువులు నాగరాజ శాస్త్రి, చంద్రశేఖర రెడ్డి, రవీంద్రకుమార్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

వీరాశిచెరువులో టీడీపీ శ్రేణుల పూజలు



వీరాశిచెరువు వద్ద సంతోషం వ్యక్తం చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలతో నిండి మొరవ పోయిన రామకుప్పం మండలం అత్తికుప్పం వీరాశిచెరువు వద్ద ఎంపీటీసీ అరుణ, ఐటీడీపీ పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్ దంపతులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఆదివారం పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ దంపతులతోపాటు నేతలు, కార్యకర్తలు చెరువుకట్టపై ఉన్న గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి కృష్ణమ్మకు జలహారతి ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి వెంకటరమణ, వడ్డెరసాధికార సమితి రాష్ట్ర సభ్యుడు భానుమూర్తి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, నేతలు మోహన్, సతీష్, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోయకొండలో ఉద్యోగులకు అందని జీతాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు అందకపోవడంతో అవస్థలు పడుతున్నారని సీఐటీయూ నాయకులు వాడా గంగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బోయకొండలో చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి సగం నెల కావొస్తున్నా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికులకు ప్రతినెలా 5వ తేదీలోపు జీతాలివ్వాలని, ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై ఈవో ఏకాంబరంను వివరణ కోరగా ప్రీ ఆడిట్‌కు జీతాల బిల్లును పంపామని, ప్రీ ఆడిట్ నుంచి ఇంకా అనుమతి రాలేదని, అనుమతి రాగానే జీతాలు ఇస్తామని తెలిపారు. శాశ్వత సిబ్బందికి సైతం జీతాలు ఇవ్వలేదని, అందరికీ ఒకేసారి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

గాడిచర్ల కృషితోనే గ్రంథాలయాలు



సర్వోత్తమరావుకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి హేమకుమార్ తదితరులు

పలమనేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పితామహులు గాడిచర్ల సర్వోత్తమరావు కృషితోనే గ్రంథాలయాలు రూపుదిద్దుకున్నాయని పలువురు రచయితలు అన్నారు. ఆదివారం పలమనేరు శాఖా గ్రంథాలయంలో గాడిచర్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాడిచర్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచయితలు బాలకృష్ణమూర్తి, దోర్నాదుల సిద్దార్థ, గ్రంథాలయ అధికారి హేమకుమార్, జిల్లా రైతు నాయకులు ఉమాపతినాయుడు, రచయితలు తొండవాని గోపీనాథ్, శ్రీపురం సీతారామయ్య, మల్లిచెట్ల దేవేంద్ర, నందగోపాల్, సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు పనులు



శ్రమదానంతో చేపడుతున్న రోడ్డుపనులు

సోమల, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): సోమల పంచాయతీ బుంగావారిపల్లె ఎంపీపీ పాఠశాల సమీపంలోని వీధిలో సిమెంట్ రోడ్డు మరమ్మతులు లేక వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆ వీధికి చెందిన గరడప్పగారి గంగాధరం, శివరామయ్య కుటుంబసభ్యులు సొంత నిధులతో మరమ్మతులు చేపట్టారు. వీధిలో పలు చోట్లు సిమెంట్ తో పనులు చేసి గ్రామస్తుల ప్రశంసలు పొందారు.

జనసురక్ష పథకాన్ని

సద్వినియోగం చేసుకోండి



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎస్బీఐ అధికారులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనసురక్ష పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు రాజేశ్‌కుమార్ పటేల్ కోరారు. ఆదివారం పుంగనూరు మండలం బోడేవారిపల్లెలో ఎస్బీఐ ఆధ్వర్యంలో జనసురక్ష పథకం ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాధారణ ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా, పెన్షన్ సంబంధిత ప్రయోజనాలు కలిగేలా జనసురక్ష తీసుకొచ్చారని అవగాహన కల్పించారు. మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ప్రయోజనం పొంది రుణాలు సక్రమంగా చెల్లించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.4 కోట్లు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిత్తూరు రీజనల్ మేనేజర్ సురేశ్‌బాబు, తిరుపతి ఏవో విజయ్‌కుమార్, పుంగనూరు చీఫ్ మేనేజర్ జి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

15 మంది కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టరు రాజ్‌యశ్వంత్

రొంపిచెర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పట్టణం ముత్యాలమ్మ గుడి వీధిలో తిరుపతి యష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టరు వి.యశ్వంత్, డాక్టరు జి.రమ్య తెలిపారు. వీరికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నామన్నారు. సమస్యలు ఉన్న వారిని పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

భయం గుప్పిట్లో పలమనేరువాసులు



ఎలిఫెంట్ క్యాంపు వద్ద కుంకీల తరలింపు కోసం ఏర్పాటు చేసిన లారీలో ఎక్కిన కుంకీ

పలమనేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని గంగవరం ప్రాంతంలో శనివారం ఉదయం కొన్ని గంటలపాటు ఒంటరి ఏనుగు హడలెత్తించిన విషయం తెలిసిందే. దీన్ని అటవీ ప్రాంతంలోకి మళ్లించే ప్రయత్నంలో అటవీశాఖ అధికారి సుకుమార్ గాయపడ్డారు. ఎలాగోలా దాన్ని అటవీ ప్రాంతంలోకి పంపించినా రాత్రి మళ్లీ ఒంటరి ఏనుగు పలమనేరు పట్టణ పొలిమేరల్లోకి వస్తుందేమోనన్న అనుమానంతో కుంకీలను తీసుకొచ్చారు. అయితే ఒంటరి ఏనుగు ఆదివారం ఉదయం వరకూ అటవీప్రాంతం నుంచి బయటకు రాకపోవడంతో కుంకీలను ఎలిఫెంట్ క్యాంప్‌కు తరలించారు.ఇప్పటి వరకు ఏనుగులు ఒకటి రెండు సార్లు పొలిమేర వరకు వచ్చినా మళ్లీ అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయేవి. అయితే శనివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో ఒంటరి ఏనుగు పలమనేరు శివార్లలో కనిపించింది.మార్నింగ్ వాక్‌కు వెళ్లే వారు గమనించి భయాందోళనకు గురయ్యారు. ట్రాకర్స్‌ను వెంటబెట్టుకొని అటవీశాఖ అధికారులు ఆ ఏనుగును అటవీప్రాంతానికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే దాడులకు తెగబడింది. ఇవన్నీ చూసిన, విన్న పలమనేరువాసులు చీకటి పడితే పట్టణ పొలిమేరల్లోకి వెళ్లేందుకు సాహసించడం లేదు. పొలిమేరల్లో ఇళ్లున్న వారు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

కుంకీల కంటే సోలార్ హ్యాంగింగే మేలు

ప్రభుత్వం లక్షలాది రూపాయలను కుంకీల కోసం ఖర్చుపెడుతోందని ఇందువలన తమకు ఎటువంటి ప్రయోజనం వుండదని రైతులు అభిప్రాయపడుతున్నారు. దాదాపు ఏడాది కాలంగా పలమనేరు సమీపంలోని ఎలిఫెంట్ క్యాంపు కోసం అధికారులు కందకాల తవ్వకం, సోలార్ కంచె ఏర్పాటు, ఆదునిక చెరువుల నిర్మాణం, కుంకీల నివాస ఏర్పాట్లు, మావటీలకు జీతాలు, వసతి, సిబ్బంది జీతాలు, కుంకీలకు ఆహార సరఫరా తదితరాల కోసం అటవీశాఖ లక్షలాది రూపాయలు వెచ్చిస్తోందని వారంటున్నారు. ఇంత పెద్దమొత్తం కుంకీలకు ఖర్చుపెట్టే బదులు ఏనుగుల దాడులను అరికట్టడంలో సత్ఫలితాలు ఇస్తున్న సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటుకు వెచ్చించి వుంటే పలమనేరు అటవీప్రాంత సరిహద్దుల్లోని గ్రామాలకు ఏనుగుల సమస్యే వుండేది కాదని వారంటున్నారు. లేదా ఇదే మొత్తాన్ని రైతులే తమ పొలాల చుట్టూ హ్యాంగింగ్ సోలార్ కంచె ఏర్పాటుకు 100 శాతం సబ్సిడీగా ఇచ్చి వున్నా తమంత తామే సోలార్ విద్యుత్ కంచె ఏర్పాటు చేసకొని వాటి నిర్వహణ తామే చేసుకొంటూ ఏనుగుల నుంచి తమ పంటలను కాపాడు కొనేవారని అంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం హ్యాంగింగ్ సోలార్ విద్యుత్‌కంచెపై దృష్టి సారించాలని వారంటున్నారు.

దుర్గంకొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం


● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

వి.కోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నాయకనేరి అటవీప్రాంతంలోని దుర్గంకొండను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన దుర్గంకొండలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం కొండపై నుంచి అటవీ అందాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నేతలు ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ప్రకృతి అందాలతోపాటు ఆధ్యాత్మిక వాతావరణంలోని దుర్గంకొండ సుబ్రహ్మణ్య క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాంబాబు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రంగనాథ్, ఈశ్వర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు ధీరజ్, నేతలు సుబ్బన్న, హరినాథరెడ్డి, నారాయణస్వామి, శబరి, సతీష్, భక్త, మహేష్‌రెడ్డి, మురుగేష్, లక్ష్మణ్, విశ్వనాథ్, నాగరాజ్, చంద్రారెడ్డి, మధు, రెడ్డెప్ప, మహదేవన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నపట్నం చెరువు అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు



సీఎంను కలిసిన ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు

సోమల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చెన్నపట్నం చెరువు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.2.25 కోట్లు మంజూరు చేసినట్లు ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం విజయవాడలో సీఎంను కలిసి పలు సమస్యలను విన్నవించామన్నారు. చెరువు కట్ట వెడల్పు, కల్వర్టు, చెరువు ఎత్తు పెంచడానికి గతంలో ప్రతిపాదనలు పంపడంతో సీఎం చంద్రబాబు నాయుడు స్పందించి నిధులు మంజూరు చేయించారన్నారు. అలాగే సోమల మార్కెట్ యార్డులో రైతుల విశ్రాంతి భవనాలు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కోసం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలోని పలువురికి సీఎం సహాయనిధి కోసం దరఖాస్తులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్, సతీష్, శ్రీనివాసులు సీఎంను కలిశారు.

కరేడు రైతుల కోసం దీక్షకు సిద్ధం

● రామచంద్రయాదవ్



అభివాదం చేస్తున్న రామచంద్రయాదవ్

పుంగనూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కరేడులో రైతుల భూములు బలవంతంగా లాక్కొనే ప్రయత్నం చేస్తే గ్రామనడిబొడ్డున రైతులతో కలిసి ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ అన్నారు. ఆదివారం కరేడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న రైతుల పక్షాన పోరాటం చేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోగా కోర్టు నుంచి అనుమతి తెచ్చుకున్నా . పోలీసులు కొంతమంది రైతులు, మహిళలపై అమానుషంగా వ్యవహరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి సెంటు భూమికూడా తీసుకోలేరన్నారు. కరేడు రైతుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు మద్దతు ఇవ్వాలని కోరారు.

భక్తులతో పోటెత్తిన బోయకొండ

● అమ్మవారిని దర్శించుకున్న 20 వేల మంది భక్తులు





చౌడేపల్లె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం అమ్మవారి భక్తులతో పోటెత్తింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సాయంత్రం 3 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఒక్క రోజులో అమ్మవారికి వివిధ సేవా టిక్కెట్లతో రూ.14.5 లక్షలు ఆదాయం చేకూరింది. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

పుస్తక పఠనాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

గంగవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కళామందిరంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాడిచర్ల చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి మాధవరెడ్డి, సంస్థ కార్యదర్శి పుష్ప, కన్నయ్యనాయుడు, లక్ష్మీనారాయణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కోనేటిరాయస్వామి పవిత్రోత్సవాలు

గంగవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అనుబంధ ఆలయంగా ఉన్న కీలపట్ల కోనేటిరాయస్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పవిత్రోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

123 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పుంగనూరు లయన్స్‌క్లబ్ నోబుల్, మదనపల్లె లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్‌లో జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 16 మంది కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు క్లబ్ చైర్మన్ కె.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి 123 మంది హాజరుకాగా పరీక్షించి 16 మందిని వైద్యులు ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మదనపల్లె లయన్స్‌క్లబ్ ప్రతినిధి గంగారపు గౌతమ్‌రెడ్డి, రఘునాథరెడ్డి, కేశవరెడ్డి, వరదారెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు టీకాలు

రొంపిచెర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు ఈనెల 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజులపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారిణి ఉష తెలిపారు. మండలంలోని 7 వేల పశువులకు ప్రభుత్వ సిబ్బంది ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి సోకితే పశువులు పూర్తిగా ఆరోగ్యాన్ని కోల్పోతాయని, పాల దిగుబడులు తగ్గుతాయన్నారు. టీకాలతో పశువులకు హాని కలుగుతుందనే అపోహ విడనాడి మూడు నెలల పైబడిన పశువులకు టీకాలు వేయించాలని సూచించారు.

వరసిద్ధుడి సేవలో

పార్లమెంటరీ పద్దుల కమిటీ చైర్మన్

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14(ఆంధ్రప్రదేశ్): పార్లమెంటరీ పద్దుల కమిటీ చైర్మన్ లక్ష్మీకాంత్‌బాజ్పాయి కమిటీ సభ్యులతో కలసి ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం అలంకార మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సీఎం సహాయనిధితో పేదలకు ఆర్థిక సాయం


పేదలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని పేదలు అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని సీఎం సహాయనిధి కోసం తన దగ్గరికి వచ్చి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నానని, ఇది ఎంతో సంతృప్తిని స్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. ఆదివారం పుత్తూరు రూరల్ మండలం తడుకుకు చెందిన కె.బాలయ్యకు రూ.96,185లు, తొర్రూరుకు చెందిన డి.పూజితకు రూ.1,59,000లు, పరమేశ్వర మంగళానికి చెందిన జానకి రామానాయుడికి రూ.1,50,223లు, గొల్లపల్లికి చెందిన మునెమ్మకు రూ.29,584లు, పుత్తూరు మున్సిపాలిటీ రాచపాళెంకు చెందిన దొరైరాజుకు రూ.1,28,048లు, విజయపురం మండలం జీఎంపురానికి చెందిన కె.రేవతికి రూ.2,50,000లు చొప్పున చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

వరసిద్ధుడి సేవలో పార్లమెంటరీ పద్దుల కమిటీ చైర్మన్


అలంకార మండపంలో ఆశీర్వాదం అందుకుంటున్న పద్దుల కమిటీ సభ్యులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 14(ఆంధ్రప్రదేశ్): పార్లమెంటరీ పద్దుల కమిటీ చైర్మన్ లక్ష్మీకాంత్‌బాజ్పాయి కమిటీ సభ్యులతో కలసి ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం అలంకార మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, యూనియన్ బ్యాంకు మేనేజర్ నవీన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ చంద్రప్రసాద్ జయంతి


వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న గంధమనేని రాజేష్, నాయకులు

నింద్ర, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్రప్రసాద్ 78వ జయంతి వేడుకలు ఆదివారం ఒరూరుపేటలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. అనంతరవారు మాట్లాడుతూ రమేష్ చంద్రప్రసాద్ రాజకీయ జీవితమంతా ప్రజా సంక్షేమం, సమాజ అభ్యున్నతికి అంకితమైందని, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన కృషి మరువలేనిదని అన్నారు. అనంతరం పిచ్చాటూరు మండలం వేలూరులోని రాయలసీమ సేవా సమితి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గంధమనేని రాజేష్, తిరుపతి చంద్ర, గోవిందస్వామి, వెంకటేశ్వరులు, హేమచౌదరి, రాధాకృష్ణ, గిరి, రాస్ ఆర్గనైజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నింద్ర, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలో శ్రీకృష్ణ యాదవ సేవా కమిటీ, అన్న గౌరీ ఆస్పత్రి సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 225 మందికి బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, కొలెస్ట్రాల్, బ్లడ్ గ్రూప్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీకృష్ణ యాదవ సేవా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు రామలింగం, జయరాం, నరేష్, వరదరాజులు, దొరస్వామి, వెంకటేశులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చర్చి పాస్టర్ అదృశ్యం


లాజరస్ (ఫైల్‌ఫొటో)

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఓ చర్చి పాస్టర్ అదృశ్యమయ్యాడు. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. ఇరువారం రోసీనగర్‌కు చెందిన లాజరస్(47) యాదమరి మండలం మాదిరెడ్డిపల్లె, దళవాయి పల్లె చర్చిల్లో పాస్టర్‌గా సేవలందిస్తున్నారు. ఇటీవల భార్య రెబెకాతో తరచూ ఇంటి విషయాలపై ఘర్షణ జరుగుతుండేది. ఈ క్రమంలో ఆదివారం నగరంలోని తేనెబండలో ఉన్న అత్తగారింట్లో భార్యను వదిలేసి వచ్చాడు. తర్వాత ఆయన కోసం భార్య బంధువులను విచారించినప్పటికీ రాలేదని చెప్పారు. ఈ క్రమంలో తన భర్త లాజరస్ కనపడటం లేదని భార్య ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కారం


దళితవాడలో వేస్తున్న బోరు

విజయపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురం దళితవాడలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో ఆదివారం బోరు వేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. సంవత్సరాలుగా తాగునీటి కోసం ఇబ్బంది పడడంతో ఎన్నికల ముందు ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నెరవేర్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ


విద్యార్థులకు బహుమతులందజేస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సంతపేట విజయలక్ష్మీనగర్ బాలవికాస్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సత్యసాయి బాలవికాస్ విద్యార్థులకు విద్యా గణపతి ఆలయ నిర్వాహకులు ఆదివారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, రమేష్, రెడ్డిమల్లు, వసంత, అమరనాథ్, సాయిలక్ష్మి, యామిని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి వేడుకలు


ధనంజయ నాయుడిని సన్మానిస్తున్న నరసింగాపురం గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింగాపురంలో శుక్రవారం నుంచి వినాయక చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన ఆదివారం విగ్రహాన్ని అందజేసిన వరత్తూరు పంచాయతీ ఒగ్గువారిపల్లెకు చెందిన టీడీపీ నేత దేవపత్ని ధనంజయ నాయుడిని గ్రామస్తులు సన్మానించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఏకాంబరం, వేణురెడ్డి, హరినాథరెడ్డి, మోహన్‌రెడ్డి, శివలింగారెడ్డి, ధనంజయరెడ్డి, కిరణ్‌నాయుడు, గజేంద్రరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నేతకు నివాళి


నిరంజన్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం సింధురాజపురం గ్రామానికి చెందిన దశరథ నాయుడు కుమారుడు నిరంజన్ కుమార్ చౌదరి ఇటీవల బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించగా.. ఆయన అవయవాలను దానం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగిన కర్మక్రియలకు టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నిరంజన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, నోమేశ్వర్‌రెడ్డి, మాధవరెడ్డి, డిల్లీ తదితరులు నివాళులర్పించారు.


కాణిపాకంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కామధేను వాహనసేవ కోసం ఆలయంలో నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న ఈవో పెంచలకిషోర్, ఉభయదారులు - నృత్యాలు చేస్తున్న కళాకారులు

ఇందిరానగర్ ప్రజల కష్టాలు తీరేనా..?

- సిమెంటు స్తంభాలపై ప్రమాదకరంగా రాకపోకలు


ప్రమాదకరంగా ఉన్న సిమెంటు స్తంభాల దారి - దెబ్బతిన్న కాలువ - కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలోని శివాలయం డౌన్ (ఏటి వార)కు ఇవతల వైపు వీరభద్ర కాలనీ ఉండగా... అవతలి వైపు ఇందిరానగర్ ఉంది. ఇక్కడ నివసించే సుమారు 50 కుటుంబాల వారంతా పేద, మధ్యతరగతి వారే. మెయిరోడ్డు నుంచి ఇందిరానగర్‌కు వెళ్లాలంటే పెద్ద కాలువను దాటాల్సిఉంది. ఇక్కడ కేవలం బ్రిడ్జి నిర్మిస్తే సరిపోతుంది. లేదా సుమారు రెండు కి.మీ చుట్టుకుని సంతపేట మీదుగా రావాల్సి ఉంటుంది. అదికూడా ముళ్ల పొదలు, మట్టి దిబ్బలతో కూడిన రోడ్డు. ఇక్కడ నివసించే విద్యార్థులు, పనులకు వెళ్లేవారంతా ఏరును దాటుకుని రావాల్సి ఉంది. తాగునీరు తెచ్చుకోవాలన్నా ట్యాంకర్ రావడానికి వీలులేకపోవడంతో మహిళలు విద్యుత్‌స్తంభాలపై నడచివెళ్లి తెచ్చుకుంటున్నారు. ప్రమాదమని తెలిసినా.. విధిలేని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. మరో వైపు కాలువలో చెత్తచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రాంనగర్‌కాలనీ, గంగనపల్లి, ప్రభుత్వాసుపత్రి మీదుగా ఈకాలువ ప్రవహిస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు సైతం ఇక్కడేనిల్వ ఉండడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు జ్వరాలు, వ్యాధుల బారిన పడుతున్నారు. ఏపుగా పెరిగిన పొదలు విషపురుగులకు నిలయంగా మారాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ బ్రిడ్జి నిర్మించాలని, కాలువను శుభ్రపరచి, మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

జీవన పోరాటం పుస్తకావిష్కరణ



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సగటు మనిషి ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారాలే సాహిత్యానికి మూలం అని సాహితీవేత్త వి. హరి నాయుడు అన్నారు.చిత్తూరులోని తపోవనం ఉన్నత పాఠశాలలో ఆదివారం హరివిల్లు లలిత కళావేదిక ఆధ్వర్యంలో శ్యామలాదేవి రచించిన జీవనపోరాటం ద్వి శతకమంజరి పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. రచయిత్రి శ్యామలాదేవి మాట్లాడుతూ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవడమే తన రచనకు మూలం అన్నారు.సాహితీ ప్రముఖులు డాక్టర్ కె.రామలక్ష్మి, పత్తిపాటి రమేష్ నాయుడు, మునస్వామి, ఉషారాణి, గణితావధాని అరుణ్ శివ ప్రసాద్, ఓం శ్రీధర్ రెడ్డి, అరుణకుమారి, సహదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం గంగమ్మగుడి దేవస్థానంలో వెలసిన ఆరిమాని గంగమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23వతేది నుంచి అక్టోబరు 2వతేది వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జలంధర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, పైనేని మురళి, హిమాచలపతిరెడ్డి, సిద్దయ్యశెట్టి, వెంకటరత్నం, రఘు నాయుడు, అర్చకులు వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మైనార్టీ నేతలకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న కాలేషా, ఎండీ అన్సర్ బాషా

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర టీడీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు కాలేషా, ప్రధాన కార్యదర్శి ఎండీ అన్సర్ బాషాలకు బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు డాక్టరేట్ పట్టాలను అందజేశారు.

శునకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

- ఆరు నెలల్లో 400 శస్త్ర చికిత్సలు


శునకానికి శస్త్ర చికిత్స చేస్తున్న పశువైద్య సిబ్బంది

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని వీధి శునకాల నియంత్రణకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నగరపాలక వాహనాల షెడ్డులో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ)సెంటర్‌లో వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. పశు సంవర్ధకశాఖ వైద్య బృందం శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. శస్త్ర చికిత్స అనంతరం శునకాలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను వేసి మూడు రోజుల పాటు ప్రత్యేక షెల్టర్‌లో ఉంచి ఆహారాన్ని అందిస్తున్నారు. వాటి ఆరోగ్య పరిస్థితి మెరుగైన తరువాత వదిలేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 190 మగ, 210 ఆడ శునకాలకు శస్త్ర చికిత్సలు చేశామని ఎంహెచ్‌వో లోకేష్ చెప్పారు. నగరంలో అన్ని వార్డుల నుంచి ప్రాధాన్యత క్రమంలో వీధి శునకాలకు శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

కొల్లాపురమ్మ సేవలో రోజా

విజయపురం, సెప్టెంబరు 14(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరులో ఆదివారం కొల్లాపురమ్మ సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. తిరునాళ్ళలో భాగంగా భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

150 మందికి వైద్యపరీక్షలు



చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణవీధి కరుణీకర్ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సుమారు 150 మందికి కంటి, దంత, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరుణీకర్ సంఘ నాయకులు కె.నిత్యానందం, దయామణి, విశ్వేశ్వర పిళ్లై, తులసీరాం, రవిచంద్రన్, సూర్యమూర్తి, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీవానదిపై ప్రమాదకరంగా వంతెనలు


యాదమరి నీవానదిపై పగుళ్లు ఏర్పడిన రహదారి వంతెన - నిర్వహణ లోపంతో దుస్థితిలో వంతెన - అధిక బరువుతో వెళుతున్న గ్రానైటు లారీలు (ఫైల్‌ఫొటో)

యాదమరి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యాదమరి మండల కేంద్రంలో ప్రవహించే నీవానదిపై ఉన్న రెండు భారీవంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దాదాపు వందేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ వంతెనలు ప్రస్తుతం పెరిగిన భారీ వాహనాల రాకపోకల వల్ల ప్రమాదకరంగా మారాయి. చిత్తూరు జిల్లా కేంద్రం నుంచి తమిళనాడుతో పాటు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే లారీలకు ఈ మార్గం దగ్గర దారి. తనిఖీలు తక్కువగా ఉండటం, పన్నుభారం తగ్గించుకోవచ్చని భారీ గ్రానైట్ లారీలను ఈ రహదారిలో నడుపుతుంటారు. ఈ లారీల అధిక బరువు కారణంగా వంతెనలు క్షీణిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు ఈ వంతెనల నిర్వహణపై దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన పర్యవేక్షణ, మరమ్మతులు చేయకపోవడం వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయని వారు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జోడిచింతల నుంచి కన్నికాపురం సరిహద్దు వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టినా ఈ వంతెనల సమస్యను పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. భవిష్యత్తులో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు. వంతెనలు కూలిపోయే ప్రమాదం ముంచుకొస్తోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కొత్త వంతెనలు నిర్మించాలని వారు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ సమస్యపై వెంటనే దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణం



పాలసముద్రం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ కాలనీలో నివసించే 21 మంది లబ్ధిదారులకు గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లు మంజూరు చేశారు. గ్రామానికి దూరంగా వున్న అటవీ ప్రాంతంలో చదునుచేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. లబ్ధిదారులపై ప్రభుత్వ అధికారులు ఒత్తిడి తేవడంతో 13 మంది మాత్రం పునాదులు వేసి వదిలేశారు. అధికారులు ఈ కాలనీకి తాగునీటి సౌకర్యం కోసం పైపులైను వేసి రెండు వెయ్యి లీటర్ల ట్యాంకులను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా చేసేందుకు లైన్లు లాగారు. అటవీ ప్రాంతం కావడంతో అక్కడ ఇల్లు నిర్మించుకుంటే తమకు సౌకర్యంగా ఉండదని ఆదిఆంధ్రవాడ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించకుండానే వదిలేశారు. దీంతో కాలనీ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. తమకు ఆదిఆంధ్రవాడ కాలనీకి సమీపంలోనే ఇండ్ల స్థలాలు ఇప్పించి, ఇల్లు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరినా అప్పటి వైసీపీ నాయకులు, అధికారులు పట్టించుకోకుండా అటవీ ప్రాంతంలో 21 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు. ప్రస్తుతం ఆ కాలనీలో పునాదులు మాత్రమే దర్శనమిస్తున్నాయి.